# ప్రేమలేఖలు

డి. జి. రామారావు

నాకు ప్రియమైనటువంటిన్ని, నా హృదయ ఆక్రమణదారులున్నూ, ప్రేమకుమారి, అని నేను ముద్దుగా పిలుచుకునే వీరమ్మ, తండ్రి వెంకన్న సాకీను తణుకు అనే నీకు,

సదరు గ్రామ కాపరస్తుడు, వెంకటేశ్వర్లు అలియాస్ వెంకోజీ, వయసు 30, ప్లీడరు గుమాస్తా అనే నేను ప్రమాణంపై వ్రాసుకున్న ప్రేమలేఖ.

నేను లోగడనుండి నిన్ను మనసార ప్రేమించుచూ ఉండి, సదరు నా ప్రేమను స్వయముగానూ, ఉత్తరముల ద్వారానూ, మధ్యవర్తుల కృతముగానూ తెలియచేసుకుని యున్నాను అదియునూ గాక నీవున్నూ, నేనున్నూ గత సంవత్సరము నాగులచవితి రోజున ఉదయం 10 గంటలూ ఆ ప్రాంతమందు మన ఊరి శివాలయమునకు దక్షిణముగా జిరాయితీ మెరక **RS No.** 39/1 రు పూరా య. 1 42 ట్లులో ఉత్తరం ఆకుల పేర్రాజుగారి మామిడితోపులో కలసుకొని, నీ, నా ప్రేమలు వ్యక్తం చేసుకోడమే కాకుండా, మన ఉభయులమున్నూ త్వరలో వివాహము చేసుకొనుటకు, మన యిరువురికనూ ఉండుకున్న ప్రేమయే ప్రతిఫలముగా ఎంచుకుని అన్ని విధముల సక్రమమైనటువంటిన్ని, 'లా' ప్రకారము చెల్లదగినటువంటిన్ని వివాహ సప్పందము మూజువాణీగా చేసుకుని యున్నాము సదరు సప్పందము పార్టు పేరఫారమెన్సు క్రింద నీవు నీ యౌవన సౌందర్యములు కొంత వరకు నా స్వాధీనము చేసియున్నావు అంతేకాక, నేనున్నూ, నీమీద నాకు గల సంపూర్ణ స్వాధీన హక్కు-భుక్తములు పూర్తిగా వదలుకొని నీ ఆజ్ఞానుసారము వర్తించుచూ యున్నాను

అట్లుండగా నీవు గత కొద్ది రోజుల నుంచి ఏ కారణముచేతనో ముఖావముగా యుంటూ నా ప్రేమను నిరాకరించుచున్నావు. నేను అలాయిదాగా ఫోగట్టా చేయగా, మన ఏజెంటుగా వ్యవహరించుచున్న మీ పనిమనిషి అప్పలమ్మ ద్వారా యీ దిగువ నుదహరించిన విషయములు తెలిసినవి అవి ఏమనగా

క్రితము నెలలో నిన్ను నేను సినిమాకు తీసుకువెళతానని రెండు లేక మూడు పర్యాయములు నమ్మించి, అట్లు జరిపించక, నేను నిన్ను నిరుత్సాహపర్చినందుకు నీవు కోపగించి, నను ఎక్స్‌పార్టీ చేసి నా ప్రేమను తిరస్కరించినట్లు తెలిసినది అట్లు నేను అన్న మాట ప్రకారము జరిపించలేకపోవుటకు నాకు బలమైన కారణములు గలవు. అంతేగాని నీ ప్రేమను

కించపరుచు ఉద్దేశ్యముతో గాని, బుద్ధి పూర్వకముగా గాని అట్లు జరిపించియుండ లేదు ఆ విషయములో నా నిర్దోషిత్వ మును నిరూపించుకొనుటకు నాకు మరి ఒక సావకాశము యిప్పించుట న్యాయ సిద్ధికి ముఖ్యావసరము. మనపై ఇనిమికల్‌గా డిస్పోస్ అయి యున్నవారి దుర్బోధలకు లోనుగావలదని యిందు మూలముగా నిన్ను హెచ్చరించడమైనది

కాబట్టి యీ ఉత్తరం అందిన వెంటనే మన పవిత్ర ప్రేమను కాలదోషం పట్టకుండా వెంటనే బ్రతికించుకుని వివాహమునకు తగిన ఏర్పాట్లు చేయవలసిందిగా కోరుచున్నాను. అప్పలమ్మ ద్వారా పంపుకున్న మల్లెపూవులు నేనే స్వయముగా యిచ్చినట్లు భావించి, స్వీకరించి నా ప్రేమను ఎక్నాలెడ్జి చేయవలసిందిగా వేడుకుంటున్నాను ఇది నా సమ్మతి

ఇట్లు,
గుమాస్తా వెంకోజీ వ్రాలు
హాలు మకాం, తణుకు.

## 2

డియర్ శశి,

ఏం డియర్, ఉత్తరాలు రాయడం మానేశావ్? మన ఉత్తరాలకి సడెన్‌గా ఏమిటీ సర్క్యులేటరీ ఫెయిల్యూర్? మొన్న నిన్ను టి. బి. వార్డులో చూశాను. ఆ చీకటి వార్డులో నువ్వు రోగుల మధ్య తిరుగుతూ ఉంటే నల్లని చెరువులో విరిసిన తెల్ల కలువలా ఉన్నావు. నిన్ను తలచుకుంటే నా బ్లడ్‌ప్రెషర్ పెరిగిపోతోంది నా రొమాంటిక్ హైపర్‌టెన్షన్‌కి నీ ప్రేమామృతమే రెమిడి

ఎప్పుడు నా హృదయంలో ప్రవేశించావో కాని నీ ప్రేమ స్వీట్ ఇన్‌ఫెక్షన్‌లా నన్నావహించింది. నా టెంపరేచర్ ఎక్కువయింది పర్‌స్పాస్ట్‌గానూ, ఇంటర్‌మిట్టింట్‌గానూ కొట్టుకోవడం మొదలు పెట్టింది. పైగా నిద్రలేమి, ఆకలి మందగించటం చాలా రోజులవరకు డయాగ్నసిస్‌కి అందని నా బాధ ప్రేమ అని తెలుసుకోగానే ఎంతో ఆనందం అనుభవించాను. సింప్టమ్స్ అన్నీ ఒక్కసారి తగ్గాయి నీ దగ్గర నుంచి ఉత్తరం లేకపోవడంతో మళ్ళీ రిలాప్స్ యిచ్చింది.

నా రోగానికి ఫార్మకోపియాలో మందు లేవు. మైసిన్‌లూ, టెట్రాసైక్లిన్లూ నాకుపశమనం కలిగించవు. నీ వాడి చూపుల యింజక్షన్లతో సూటిగా నా హృదయాన్ని తాకి, నీ ప్రేమనీ ఆనందాన్ని అందించు. నీ మధుర దరహాసంతో మండే నా శరీరాన్ని ఎనోయింట్ చెయ్యి నీ కౌగిలి బాండేజ్‌తో అలసిన నా శరీరాన్ని నార్మల్సీకి రిస్టోర్ చెయ్యి.

నా నాన్‌స్పెసిఫిక్ విరహానికి ఒకే ఒక బ్రాడ్ స్పెక్ట్రమ్ యాంటీబయాటిక్ నీ స్పర్శ. మల్టివైటమిన్ సిరప్‌లాంటి నీ తియ్యని మాటలు వినందే నాకు నీరసం పట్టుకుంటుంది నా జీవితంలో యిప్పుడు సువ్వొక హాపీ అబ్సెషన్ ఆపరేషన్ చేసే కత్తులలాంటి చురుకైన, నాజూకైన నీ సన్నని వేళ్ళ నా శరీరంలో బాధ తీసేసి నన్ను కాపాడు వెల్ ఎక్విప్డ్ థియేటర్‌లా మా పూలతోట పిలుస్తోంది. మన ఆపరేషన్ లవ్‌కి ఆలస్యం ప్రమాదం నీ

యౌవ్వనమే నాకు ఎల్ ఎస్ డి నీ మత్తులో నన్ను మైమరపించు

ఎమర్జన్సీ' డాక్టర్ శశీ' ఓర్పు హరిస్తున్న నీ పేషంటుని రక్షించుకో ఇదిగో యిప్పుడే నా ప్రిస్క్రిప్షన్‌పాడ్ మీద రాసుకుంటున్నా

టేక్ శశీ, డే అండ్ నైట్ ఫర్ వైఫ్
యువర్స్ ఎవర్ డిపెండబుల్
డా ప్రేమానంద్

## 3

ప్రియమైన వరలక్ష్మీ,

నువ్వు నిజంగా ప్రియమైపోతున్నావు, రోజూ పెరిగిపోతున్న ధరల్లా నీ పేరులో లక్ష్మి ఉంది, కాపిటలిస్టుల యినప్పెట్టెలో డబ్బున్నట్టు కాని నేను కోరుకునే వరం నీ ప్రేమ నల్లబజారులాంటి నీ కురుల్లో దాచుకున్న ప్రేమని, యీ మధ్యతరగతి మాధవరావుకి డిపోజిట్ చేసి పంచిపెట్టు అప్పుడే నీ ప్రేమకి సార్థకం దేశానికి అభ్యుదయం ప్రేమించడం మన జన్మ హక్కు అది ఏ శక్తీ ఆపలేదు దాస్య శృంఖలాలను త్రెంచుకున్న ప్రజావిప్లవంలా అది ఏనాడో, ఒకనాడు విరుచుకు పడుతుంది

బూర్జువా మనస్తత్వంగల నీ తండ్రి, కులాచారాలకు ప్రతినిధిగా ఉన్న మీ అమ్మ, తమ స్వార్థాలకు నిన్ను, నీ ప్రేమనూ కించపరుస్తున్న ఛురా తత్వవాదులు మీ అన్నయ్యలు మన ప్రేమను వెన్నుపోటు పొడవాలని చూస్తున్నారు కాని మన ప్రేమ అజేయం ఎన్ని కష్టాలు ఎదురైనా ఎన్ని తుపాకి గుళ్ళు ఎదురొచ్చినా యీ మాధవరావు పురోగమనాన్ని ఎవరూ ఆపలేరు మనలాగే అభివృద్ధి నిరోధకుల పన్నాగాలకు బలి అవుతున్న పీడిత ప్రేమికులకు మనం ఆదర్శ దంపతులం కావాలి నీ ప్రేమ నాకు ఒక నీచమైన, పాశవికమైన కామం కాదు నాకు అది ఒక యిజం యిది పదహారణాల నిజం మన ప్రేమ విజయం మన సంఘ చరిత్రలో ఒక మైలురాయి కావాలి మితవాద శక్తులకి కన్ను విప్పు కావాలి మనది ముందుకు వేసిన అడుగు అది అగ్నిహోత్రం చుట్టూ ఎడడుగులు వేసి తీరుతుంది మన పూలరంగుల ప్రేమ బావుటా యు ఎన్ ఒ శిఖరాగ్రంపైన ఎగురవేద్దాం మన ప్రేమాణుశక్తి విజృంభించి నవచైతన్యం వెదజల్లుతుంది నీ కంఠంలో నాకు భవిష్యత్తు వినిపిస్తుంది నీ చూపులో నాకు ఆగామిలోకాలు కనిపిస్తాయి నీ నడకలో నాకు జగన్నాధుని రథ చక్రాల కంపనం స్ఫురిస్తుంది

(హిమాలయ శిఖరాలను అధిరోహించుదాం వియత్నాం వీధుల్లో విహరిద్దాం కలకత్తా కాళికలను దర్శిద్దాం బంజరు భూముల్లో పాటలు పాడదాం)

వరలక్ష్మీ, నమ్ము నిన్ను నేను గాఢంగా ప్రేమిస్తున్నాను మన వివాహం ఏ శక్తీ ఆపలేదు ధైర్యం తెచ్చుకో మనల్ని విడదీయడానికి ప్రయత్నించే యీ సంఘాన్ని కూకటి వేళ్ళతో కదిలిద్దాం ఇదే మన ప్రతిజ్ఞ

జై వరలక్ష్మీ' జై మాధవరావ్
మన ప్రేమ వర్ధిల్లాలి
మధ్యతరగతి మాధవరావు ★